# చింతచెట్టు

అది మధ్యాహ్నం మూడుగంటల సమయం. వేసవి కాలం కాకపోయినా ఎండ తీవ్రత యింకా పూర్తిగా తగ్గలేదు.

ఆ సమయంలో మట్టి రోడ్డు మీద ఎర్రటి దుమ్ము రేపుకుంటూ పోతోంది జీపు. జీపు వెనక సీట్లో కూర్చొని వున్న రామనాథంకు అల్లంత దూరంలో కనిపిస్తున్న చెట్టును చూసి తెగ ఆనందం కలిగింది. జీపు ముందుకు దూసుకుపోయేకొద్దీ ఆ చెట్టు యింకా స్పష్టంగా కనిపిస్తోంది. దాన్ని చూస్తున్న రామనాథం బుర్రలో గతం తాలూకు ఆలోచన్లు కంది రీగల్లా రేగుతున్నాయి.

"అదే చెట్టు! చింత చెట్టు!!"

"ఆ చెట్టు కింద మొదట్లోనే అయ్యవారు కూచునేవాడు. రెండు వరుసల కుర్రాళ్ళు, మూరెడెత్తు అరుగులావేసి, దాని మీద మట్టి పోసి చదరం చేసి పెట్టిన ఆ రాతి తిన్నె మీదనే అయ్యవారు కూర్చొని చదువు చెప్పేది. ఆ చెట్టు కింద చదువుకుని ఎందురు పిల్లకాయలు ఆఫీసర్లయినారో. అదిగో! ఆ చెట్టుకిందనే నేనూ ఓనమాలు నేర్చుకున్నది. అప్పసామిపిళ్ళె అయ్యవారు దగ్గర బెత్తం దెబ్బలు తిన్నది అక్కడే. నా బంగారు భవిష్యత్తుకు పునాదులు పడ్డదీ అక్కడే. ఎప్పుడో చిన్నప్పుడు పదేండ్ల వయసు వరకు ఆ చెట్టుకిందనే చదువుకున్నాను. నన్నింతవాణ్ని చేసింది ఆ చెట్టుకిందబడే. ఏడో క్లాసులో వుండంగా అనుకుంటా. మా నాయనకు ట్రాన్స్‌ఫర్ వచ్చి వెళ్ళిపోయినాం. మా నాయన అప్పుడు పక్కూర్లో టీచర్‌గా వుండేవాడు. ఆయన పని చేసే వూర్లో సౌకర్యం లేక ఈ ఊళ్లో ఇల్లు తీసుకున్నాం. ఓయబ్బా. ఇరవై ఏండ్ల తర్వాత అనుకోకుండా ఈ ఊరు రావాల్సి వచ్చింది".

ఇంతలో జీపు ఆగి పోవడంతో రామనాథం ఆలోచన్లకు అడ్డుకట్టపడింది.

"ఏమైందిరా?" ప్రశ్నించాడు డ్రైవర్‌ని.

"రోడ్డు ఇంతేసార్. ఇంక ఊర్లోకి పోదు. నడిచి పోవాల్సిందే. ఇంతవరకూ ఆఫీసర్లెవరూ ఈ ఊర్లో అడుగుపెట్టలేద్సార్ ... మీరే మొదట" అని ఏదో చెప్పబోయాడు.

అంతలో అతని మాటలు పూర్తికాకనే "సరి సరి. అదీ మంచిదేగానీ. దిగు దిగు. నడిచిపోదాం." అంటూ జీపు దిగి మెల్లగా ఆ కాలిబాట గుండా నడవసాగాడు.

సీట్లో వున్న ఫైలు, పుస్తకాలు తీసుకొని డ్రైవరూ అతన్ననుసరించాడు. ఆ పల్లెకు కొంత దూరంలో ఓ చిన్న గుట్ట .... ఆ గుట్ట పైన వున్న ఓ మర్రి చెట్టు, కాళ్ళు చాచి నిలబడ్డ ఆక్టోపస్ జంతువులా, నిటారుగా కనిపిస్తోంది. దాన్ని చూడగానే రామనాథం మెదడులో చిన్ననాటి స్మృతులు ఒక్కొక్కటే కదలాడాయి. సాయంత్రం వేళ కొంగలు, కాకులు, యింకా రకరకాల పక్షులు, పగటివేట చాలించి, గుంపులు గుంపులుగా ఆకాశంలో ఎగురుకుంటూ వచ్చి ఆ చెట్లో వాలడం

అతని కింకా గుర్తే. ఆ మఱ్ఱి చెట్టు చిగురించినపుడు విశాలంగా కనిపించే లేత ఆకుల్ని రైతులు కోసుకొనివెళ్ళి వాటిని ఎండబెట్టి, ఎండిన తర్వాత నీటిలో నానబెట్టి, వాటితో విస్తరాకులు కుట్టుకోవడం కూడా అతనికి గుర్తే. ఆ పల్లె చుట్టూ చెరుకుతోటలు, మామిడి తోటలు, ఉత్తరానున్న చెరువు, ఆ చెరువు నుంచీ వచ్చే కాలువలు, మడకలు భుజానవేసుకుని మళ్ళగెనిమలంట తిరిగే రైతులు అంతా అతనికెరుకే. అక్కడ అమాయకులయిన ఆ పల్లె పిల్లలతో అతని శైశవ క్రీడలూ ఆనందంగానే గడిచాయి. అదంతా తలుచుకుంటుంటే రామనాథానికి వళ్ళు పులకిస్తోంది. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఆ ప్రదేశాన్ని చూడాలని అతనిలో వున్న తీరని కోరిక. ఇన్ని రోజులకి ఆ కోరిక తీరబోతోంది! లోలోపలే ఆనందపడిపో సాగాడు రామనాథం.

"ఇప్పుడు ఆ పల్లెలో స్కూలుకు పెద్ద బిల్డింగువుంది. అలాగే పల్లెలోని పూరిండ్లన్నీ పక్కాబిల్డింగులై పోయివుండచ్చు. అప్పుడు ఒక వేరుశనగకాయల మూట నలభై కేజీలు ముప్పయి రూపాయలమ్మేది. ఇప్పుడేమొ మూడువందలు. అప్పుడు నూరుకేజీల వడ్లమూట యాభై రూపాయలు. ఇప్పుడేమొ రెండువందలు. శేరు వంకాయలు పావలా. ఎంత పెరిగాయిప్పుడు!. వాటికనుగుణంగానే ఆ ఊరూ అభివృద్ధి చెందివుంటుంది. ప్రతి ఇంటికీ కరెంటు, ప్రతి కపిలబావికీ ఒక మోటరు అంతా నిత్యకళ్యాణం. పచ్చతోరణంగా వుంటుంది కాబోలు". అనుకుంటూ పరధ్యానంగా నడుస్తున్న రామనాథం. కాలు చురుక్కుమనే సరికి "అబ్బా!" అని అలాగే నిలబడిపోయాడు.

"ఏమైందిసార్?" కంగారుగా పరిగెత్తు కొచ్చాడు డ్రైవర్. రామనాథం కాలు తడుముకుంటూ "ముల్లు గుచ్చుకుందిరా...." అని, అరికాలిలో గుచ్చుకున్న ముల్లు లాగేసి, తిరిగి కుంటుతూ నడవసాగాడు.

"ఇది దిక్కూ దిమానంలేని ఊరు సార్. ఎవ్వరూ ఈ ఊరికి రారు. మీరు కాబట్టి మన ఆఫీసుకు చాలా దూరంలో వుండే ఈ పల్లెకు వచ్చారు. ఒక సౌకర్యమా పాడా! దారయినా సక్రమంగా లేదు. మీ చెప్పులో దూరి కాల్లో గుచ్చుకుంది ముల్లు" అని మాట్లాడుతూ అతని వెంట నడవసాగాడు డ్రైవర్.

ఇద్దరూ ఆ ఊరికి చేరుకున్నారు. అక్కడికి చేరిన రామనాథానికి తను ఊహించుకున్న మార్పులేవీ కనిపించలేదు. దాంతో ఒక్క నిముషం చకితుడయ్యాడు.

ఆ పూరిండ్లు అలాగేవున్నాయి. ఆ మనుషులూ అలాగే వున్నారు. ఆ చింత చెట్టూ అలాగేవుంది. ఏ మార్పూలేదు. వచ్చిన మార్పంతా పంటపొలాల్లోనే.

అప్పుడయితే .... సంవత్సరం పొడుగునా పంట చేళ్ళు, మళ్ళు పుంజిగా కనిపించేవి. గొర్రెలతో, మేకలతో, పశువులతో పల్లె ఎప్పుడూ సందడిగా వుండేది.

సంవత్సరాల తరబడి తిష్టవేసిన కరువు వల్ల ఆ ప్రాంతంలో పచ్చదనం మచ్చు కయినాలేదు. పశువులు, గొర్రెలు ఆనాడు లాగా గుంపుగాలేవు. ఒకటో అరో కనిపిస్తున్నాయి. అవయినా

ఆరోగ్యంగాలేవు. మేత లేక బక్క చిక్కి చర్మం కప్పుకున్నట్లు కనిపిస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే రామనాథంకు ఆశ్చర్యమే కాదు ఆవేదన కూడా కలిగింది.

ఆ చెట్టు కింద ప్రస్తుతం ఎవ్వరూ కనిపించలేదు. దానికి కొంత దూరంలో పాడుబడిన సత్రం లాంటి శిథిలావస్థలో వున్న ఒక యిల్లు కనిపించింది.

ఆ చెట్టు కింద ఆ అరుగు అలాగేవుంది. ఎవ్వరో ఇద్దరు పిల్లలు ఆ అరుగు కింది భాగాన గోళీలు విసరివేస్తూ ఆడుకుంటున్నారు.

"ఇదే స్కూలేమొ?" అని ఒక్క క్షణం మనసులోనే అనుకుని రికార్డులో బిల్డింగు వున్నట్లుంది కదా. అయినా నా భ్రమ కానీ ఇంకా ఈ చెట్టుకిందనే బడి ఎలా వుంటుంది? అనుకున్నాడు.

ఆ చెట్టు కింద నిలబడి ఎదురుగా కనిపిస్తున్న వీధిలోకి చూశాడు. ఉత్తర దక్షిణంగా వున్న ఆ వీధిలో కొందరు స్త్రీలు చీరకుచ్చెళ్ళు ఎగచెక్కి నడుముల మీద నీళ్ళ బిందెల్ని పెట్టుకొని మోసుకువెళుతున్నారు. కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. ఇద్దరు ముసలివాళ్ళు, ఒక బండరాతిమీద కూర్చొని వక్కాకు నములుకుంటున్నారు. వాళ్ళు తంబ కర్ర ఉమ్మిన ఆ ప్రదేశం ఎర్రగా రక్తపు మరకలతో నిండిఉన్నట్లు కనిపిస్తుంటే ఈగలు జుమ్మని ఆ ఎంగిలిపైన వాలుతున్నాయి. వీధిలో పెద్దగా జనసంచారం లేదు.

డ్రైవరూ ఆ ప్రదేశాన్ని వింతగా చూస్తున్నాడు. సుమారు పదిహేను సంవత్సరాల నుంచీ ఆ డ్రైవర్ అక్కడ పనిచేస్తున్నా ఏనాడూ ఆ ఊర్లోకి అడుగు పెట్టి ఎరుగడు. ఆ మాటకొస్తే ఒక్క రాజకీయ నాయకులు తప్ప ఏ ఆఫీసరు ఆ ఊరిని సందర్శించిన పాపాన పోలేదు. అందుకే ఆ డ్రైవర్‌కి ఆ ప్రదేశం కొత్తగా, విచిత్రంగా అనిపిస్తోంది.

అక్కడ గోళీలు అడుకుంటున్న విద్యార్థుల్లో ఒకతన్ని పిలవమన్నాడు డ్రైవర్‌తో.

వెంటనే డ్రైవర్ "వరే అబ్బాయిలూ! యిలా రండ్రా!" అంటూ కేకేశాడు. ఆ కేక విని ఎవరో కొత్తయ్యవార్లలా ఉన్నారనుకుని ఆ పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చి చేతులు కట్టుకొని నిలబడ్డారు. వారి ముఖాల్లో ఎంతో వినయం ప్రదర్శితమౌతోంది!

"స్కూలుండేది ఎక్కడా?" ప్రశ్నించాడు రామనాథం.

"స్కూలంటే మేం సదువుకునేదా సా?" నసుగుతూ ప్రశ్నించాడు ఆ యిద్దరిలో ఒక విద్యార్థి.

"ఆఁ అదే!"

"మేం చదువుకునేదీ చెట్టుకిందనేసా!" బుద్ధిగా సమాధానం చెప్పాడుతను.

"మరి పిల్ల లెక్కడ? ఈ రోజు స్కూల్ లేదా?"

"పిలకాయల్సా .... ఈ దినంసా ... రాలేసా" తడబడుతూ చెప్పాడు మరో విద్యార్థి.

"ఎందుకు?" డ్రైవర్ ప్రశ్నించాడు.

"అయ్యావారు పొద్దనొచ్చిసా. ఈ దినం మీకు శలవురా. ఇండ్లకు పొండ్రా అనిసా. సెప్పినాడుసా. అందుకని అందరూ ఇండ్లకు బోయినారు సా!"

వివరంగా చెప్పాడు మొదటి విద్యార్థి. అది విన్న రామనాథంకు, అక్కడ పాఠశాల నడుస్తున్న తీరు తెలిసిపోయింది.

జిల్లా కేంద్రానికీ, మండలాఫీసుకు ఆ ఊరు చాలా దూరంలో ఉండడంతో తనిఖీకి ఎవ్వరూ రారన్న ధీమాతో టీచర్ స్కూలుకు ఎగనామం పెడుతున్నాడని తెలుసుకోవడానికి అతనికి ఎంతోసేపు పట్ట లేదు.

"సరే! నీ పేరేమిటి బాబు"

ఆ అబ్బాయి నడిగాడు రామనాథం

"నా పేరు పుల్లప్పసా! ఈడి పేరు నాగరాజ. ఇద్దరం నాలుగో క్లాసేసా!"

"పుల్లప్ప అదేం పేరయ్యబాబు" అనుకుని "ఇప్పుడు అయ్యావారెక్కడుంటాడు?" అని తిరిగి ప్రశ్నించాడతను.

"పెసిరింటోళ్ళ యింటికాడుంటాడు సా!"

"ప్రసిడెంటింటికాడనా ...... అక్కడెందుకుంటాడు?" అనుమానంగా అడిగాడు రామనాథం.

"ఆడ మా అయ్యావారు, ఇంకా కొందరు, ఎబ్బుడూ సీట్లాడతావుంటారు సా"

కాస్తా చనువేర్పడడంతో నిజాన్ని నిర్భయంగా చెప్పాడు పుల్లప్ప.

"మరి రికార్డులు, రిజిష్టర్లు ఎక్కడుంటాయి." కూపీలాగాడు.

"అయ్యి కూడా పెసిరింటోళ్ళింట్లోనే వుంటాయిసా?"

"సరే పుల్లప్పా! నువ్వెల్లి అయ్యావార్ని పిల్చుకొని, రికార్డులు తీసకరమ్మను. మా డ్రైవర్ కూడా వస్తాడు. తీసకపో" అని పురమాయించాడు రామనాథం.

రాజు జారీ చేసిన ఆజ్ఞను అమలు చేయడానికి వెళుతున్న సైనికుల్లా ఉత్సాహంగా బయలుదేరారు వాళ్ళు.

క్షణాల మీద అక్కడికి రిజిష్టరు, రికార్డులు పట్టుకొని, పరుగెత్తుకుంటూ వచ్చాడు ఆ స్కూల్ టీచర్.

ఎప్పుడూ లేందే ఇప్పుడు 'తనిఖీ' అధికారులు వచ్చారని విన్నప్పటి నుంచీ సగం జావకారిపోయివున్నాడా టీచర్.

ఒకప్పుడు ఆ చెట్టుకిందనే ఓనమాలు దిద్దుకొని, చదువుకున్న రామనాథం, ప్రస్తుతం 'ఇన్స్‌పెక్టర్ అఫ్ స్కూల్స్' హోదాలో తనిఖీకి వచ్చాడు.

కొత్తగా ఇన్స్పెక్టర్‌గా వచ్చిన రామనాథం వస్తున్నట్లు అక్కడ ఎవ్వరికీ తెలియదు. స్వతహాగా రామనాథం చాలా స్ట్రిక్ట్ ఆఫీసరు. ముక్కుకు సూటిగా పోయే రకం. అవినీతికి, అక్రమాలకు లొంగని ఘటం. 'ఇలాంటి స్ట్రిక్టు ఆఫీసర్లుండబట్టే ఇంకా భూమి పైన వర్షాలు పడుతున్నాయి'

అంటారు అతని గురించి తెలిసినవాళ్ళు.

డ్యూటీలో జాయిన్ అయిన వారం నుంచీ అన్ని స్కూళ్ళు తిరిగి, ఇన్స్‌పెక్షన్ ప్రారంభించాడు రామనాథం. ఎవ్వరికీ తెలియజేయకుండా రహస్యంగా తనిఖీకి వెళితేనే నిజాలు తెలుస్తాయన్న అభిప్రాయం అతనిది. కాబట్టే తనిఖీకి వస్తున్నట్లు ఏ తాకీదు పంపించకనే వచ్చేశాడు. ఈ విషయం తెలియకనే ఆ టీచర్ దొరికిపోయాడు.

ఆ టీచర్ ముఖంలో దొరికిపోయానన్న గిల్టీ కాన్షియస్, ఫియర్‌నెస్ అన్నీ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

విద్యార్థులందరూ అప్పటికీ ఆ చెట్టు కింద చేరిపోయి వారి స్థలాల్లో వాళ్ళు కూర్చున్నారు.

"నమస్కారం సార్! కూర్చోండి" అంటూ అతి వినయంగా కర్రాళ్ళ తిన్నెను చూపించాడు టీచర్.

"నీ పేరేమిటి?" కూర్చోకనే ప్రశ్నించాడు రామనాథం.

"ఆర్. సుబ్రహ్మణ్యం సార్!" వినయంగా వంగి చెప్పాడు.

"ఈ రోజు స్కూలుకు శెలవా??"

"అబ్బే అదేంలేద్సార్"

"మరెందుకొదిలేశావ్?"

"కొంచెం జ్వరంగా ఉంటేనూ ..."

"శెలవు పెట్టొచ్చుగా?"

"శెలవు ...." ఏదో చెప్పాలని చెప్పలేక నసగసాగాడు.

"ప్రెసిడెంటుగారింట్లో పేకాట ఆడడానికి జ్వరంలేదా నీకు?"

"అదీ అదీ ...." ఏం చెప్పాలో తోచలేదు సుబ్రహ్మణ్యానికి.

రిజిష్టర్ తెరచి చూస్తూ .... "అటెండన్సు కూడా వేశావే! ఏమిటయ్యా యిదీ!" అన్నాడు రామనాథం.

దొరికిపోయినందుకు తన్నుతానే మనసులో తిట్టుకుంటూ మౌనంగా నిలబడ్డాడు సుబ్రహ్మణ్యం.

"టీచర్ అంటే ఒక్క గొప్ప బాధ్యత కలిగినవాడు. ఒక విజ్ఞాన జ్యోతి. ఆ జ్యోతితో ఎన్నో వెలగని దీపాలని వెలిగించి విద్యాదానం చేయాల్సిన పవిత్రమైన కార్యం నిర్వర్తించేవాడు. అలాంటిది, నువ్వు చేస్తున్నదేమిటి? యూ ఆర్ చీటింగ్ ది చిల్డ్రన్ ..." అని చివాట్లు పెడుతూనే విద్యార్థుల వైపు తిరిగి "అయిదో తరగతి వాళ్ళెందరు? మొత్తం స్ట్రెంక్త్ ఎంత స్కూల్లో?" అని ప్రశ్నించాడు.

"అయిదో తరగతిలో పది మంది, నాలుగులో పద్నాలుగు, మూడులో పద్దెనిమిది, ఒకటి రెండులో కలిసి ఇరవై అయిదు. మొత్తం కలిపి అరవై ఏడు మంది" లెక్క చెప్పాడు సుబ్రహ్మణ్యం.

"స్కూలుకు ఫర్నీచర్ లేదా?" చుట్టూ పరికిస్తూ అడిగాడు రామనాథం.

"టేబుల్ లేద్సార్, ఎన్ని సార్లు అర్జీ పెట్టుకున్నా లాభం లేకపోయింది. వున్న ఒక్క చెయిరూ... ప్రెసిడెంటు గారింట్లో వుంది ..."

"అక్కడెందుకుంది." సీరియస్‌గా అడిగాడు.

"సంవత్సరం క్రితం ప్రెసిడెంటు గారమ్మాయి పెద్ద మనిషయితే, కూర్చోబెట్టడానికి తీసుకువెళ్ళారు .... తిరిగి ఇవ్వనేలేదు ... అందుకే ఈ తిన్నె చైర్‌గా ...." చల్లగా చెప్పాడు.

"ఇంక నువ్వేం చేస్తున్నట్లు స్కూల్లో. అరవైమందికి పైగా వున్న పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నావు. సరే. ఈ ఊరికి స్కూలు బిల్డింగ్ ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నదే. దాన్ని రెండేళ్ళ క్రితం కూడా రిపేరు చేయించినట్లు వుందే. ఇంతకీ బిల్డింగ్ ఉందా?" అనుమానంగా అడిగాడు.

"స్కూలు బిల్డింగు ...." మళ్ళీ నీళ్ళు నమిలాడు టీచర్.

ఇంతలో పుల్లప్ప అందుకున్నాడు.

"సార్! దాపక్కన కనిపించేదే మా స్కూలు సా!" అన్నాడు పైకి లేచి.

ఆ మాటతో "సరే .... రా" అంటు అక్కడికి కొన్ని గజాల దూరంలో ఉన్న శిథిల గృహం దగ్గరకు వెళ్ళాడు రామనాథం.

దగ్గరికిపోయి చూస్తేగానీ దాని గోడపైన రాసి వున్న స్కూలు పేరు కనిపించలేదు.

అది స్కూలులాగా అనిపించలేదు. గొడ్లచావడిలాగా చెత్తాచెదారంతో అసహ్యంగా కనిపిస్తోంది. ఒక వైపు పై కప్పు వరిగిపోయి, రేపోమాపో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

"బిల్డింగు ఉండగా ... చెట్టుకింద పెట్టుకున్నావెందుకు క్లాసులు?" రామనాథం తిరిగి ప్రశ్నించాడు.

"పడిపోతుందనీ ..." ఏం చెప్పాలో తోచక మధ్యలోనే ఆపేశాడు సుబ్రహ్మణ్యం.

ఇంతలో లోపలికి తొంగి చూసిన రామనాథం, లోపలి దృశ్యం చూసి హతాశుడైపోయాడు.

అందులో నాలుగు పశువులు కట్టి వేయబడి వున్నాయి. పేడ, పశు మూత్రంతో దుర్గంధంగా వుంది. పశువులు నమలలేక వదిలేసిన చొప్పదంట్లు చిందరవందరగా పడివున్నాయి....

"ఇందులో పశువులున్నాయి కదయ్యా మరి?"

వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అడిగాడు రామనాథం.

ఇక నిజం చెప్పక తప్ప లేదు సుబ్రహ్మణ్యానికి.

"నేను వచ్చినప్పట్నించీ ... ఈ స్కూల్లో ప్రెసిడంటుగారి గొడ్లే ... ఇక్కడుంటున్నాయి సార్ ... ఆయన పెద్ద భూస్వామి. రాజకీయ పలుకుబడి కూడా వున్నవాడు. ఇదేమిటని అడగలేక .... ఈ చెట్టుకిందనే ..." అని ఇంకా ఏదో చెప్పబోయాడు.

ఆ పైన వినలేక పోయాడు రామనాథం.

"ఛీ ... ఎందుకయ్యా నీలాంటి వాళ్ళు ఉద్యోగం చేసేది? ఇష్టం లేకపోతే విరమించుకోరాదు. ఇలా విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం ఎందుకయ్యా. చదువుకున్నావే పొలిటీషియన్ అనీ, ధనవంతుడనీ ప్రెసిడెంటు తొత్తుగా బతుకుతూ అతనితో పేకాడుతూ కాలం

గడపడానికా నీకు ప్రభుత్వం జీతమిచ్చేది ఛీ" అని చివాట్లు పెట్టి, కంప్లైయింటు బుక్కులో అన్నీ రాసి, అతని సంతకం తీసుకున్నాడు రామనాథం.

"సార్! సార్! తప్పయిపోయింది క్షమించండిసార్!" అంటూ సుబ్రహ్మణ్యం అతని కాళ్లావేళ్లా పడ్డాడు. కానీ అతను లెక్క చేయలేదు. డ్రైవర్‌తో బాటు అక్కడి నుంచీ వచ్చేశాడు.

"సుబ్రమణ్యంది తప్పేకావచ్చు. కానీ ఉచిత విద్యా, మళ్ళీ బడికి, గ్రామాభ్యుదయం అని మాటి మాటికి వీరంగాలు పలికే ప్రభుత్వాలు కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకుండా, ఏమీ పట్టనట్లుండి పోతున్నాయి కదా. కనీసం ఉన్నవాటిని సక్రమంగానయినా వినియోగపడేటట్లు కూడా చూడడం లేదు. పైగా జన్మ భూములు, అనీ, జనాభా లెక్కలు, ఈ లెక్కలు ఆ లెక్కలూ అనీ మాటి మాటికీ ఉపాధ్యాయులనెత్తిన పడడం, బాగా చదువుకున్న టీచర్ల పైన పెత్తనం చలాయించే అధికారం ఏ అర్హతా లేని పార్టీ కార్యకర్తలకు, ప్రెసిడెంట్లకు యివ్వడం చేస్తుంటే స్కూళ్ళు ఎలా బాగుపడతాయి. విద్యార్థులకు చదువెలా వస్తుంది? ఎవళ్ళకు వాళ్ళు దొంగలై పోయిన ఈ దేశంలో ఈ విద్యావ్యవస్థ ఏమౌతుంది?" అని తిట్టుకుంటూ పల్లీయుల అమాయకత్వానికీ, దుస్థితికీ జాలిపడుతూ, 'ఇంకా ఇలాంటి స్కూళ్ళు దేశంలో ఎన్ని ఉన్నాయో' అనుకుంటూ నడవసాగాడు.

కొత్తగా వచ్చిన ఇన్స్‌పెక్టర్ స్ట్రిక్టని తెలిసి ప్రెసిడెంటింట్లో పేకాడడానికి వెళ్ళినందుకు మరోసారి తనను తానే తిట్టుకుంటూ, ఆ చింత చెట్టు బడిలోనే, ఆ రాతి తిన్నె పైనే కూలబడిపోయాడు సుబ్రహ్మణ్యం.

కానీ ... తాను చదువుకునే రోజుల్లో వున్న స్థితి కంటే, ఇంకా అనేక రెట్లు దిగజారి పోయిన పల్లె పరిస్థితికి బాధపడిపోతూ వెళ్ళి జీపెక్కి కూర్చొన్నాడు రామనాథం.

జీపు కదిలింది!

"ఉపాధ్యాయుడి ప్రతి మాటా, ప్రతి నడవడిక అన్నీ. తన దగ్గర చదువుకుంటున్న విద్యార్థుల పైన ముద్రవేస్తాయి. అన్ని వృత్తుల్లోకంతా అతి పవిత్రమైంది ఉపాధ్యాయవృత్తి, అందుకే టీచర్ అయినవాడు ఎంతో ఆదర్శంగా ఉండాలి. ఏ రాజకీయాలకు పక్ష పాతాలకూ తలొగ్గకూడదు. కానీ ఈ ప్రొఫెషన్ కూడా ఇలా పతనమై పోయిందేమిటి? సమాజం అంతగా కుళ్ళిపోయిందా! ఛీ" అనుకుంటూ అటువైపు చూశాడు.

ఆ చింత చెట్టు అలాగే నిర్మలంగా కనిపిస్తోంది!

"తాను బతికున్నన్ని రోజులూ తనదాపున చేరిన వాళ్ళకి చల్లని నీడ నిచ్చే చింత చెట్టు చినతల్లి అనిపించుకుంటుంది. తన నాశించిన వారికి చింతకాయల్నిస్తుంది. చివరికి ఎండిపోయినా, అవసరమైన కలపగా మారి మానవునికి మేలు చేస్తుంది ... టీచర్ కూడా అదే ఆదర్శంగా నిలవాలి" అనుకుంటూ అలాగే చూస్తుండిపోయాడు రామనాథం.

జీపు వేగాన్ని పుంజుకునేకొద్దీ ఆ చింత చెట్టు దూరదూరంగా వెళ్ళిపోతూ కనిపిస్తోంది.

● *13-3-1994 విశాలాంధ్ర, దిన పత్రిక* ●